# మన పురోహితులు అలా వున్నారు
# వ్రతాచారులు ఇలా వున్నారు

• ఖండవిల్లి సాంబశివరావు •

★

శ్లో॥ తులంపోడుం మయాదత్తం
ముంచి నేతి సమన్వితం
తేన మే సఫలావాప్తిః
భవేజ్జన్మని జన్మని."

బ్బాబూ సత్యం, అమ్మా మీనా, మీ మనస్సులో ఏకోరిక ఉందో చెప్పి సఫలం కావాలని కోరుకొని సత్యనారాయణస్వామివారి పాదాలమీద పెట్టి నమస్కారంచేయండి అన్నాడు—పురోహితుడు వెంకటేశ్వర్లు. "నాకు ఒక్కటే కోరిక ఉంది. ఈ కొత్త ఇల్లు చాలాడబ్బు ఖర్చుచేసి కట్టేను; ఆ సొమ్ము అద్దెలరూపంగా వేగిరం వచ్చేయాలి" అన్నాడు సత్యం ప్రకాశంగా, (చెవిటి వాళ్ళకుకూడా వినిపించేటట్లు).

"అదేంటండీ! మనస్సులో అనుకోవాలీగాని పైకి అరవాలా?" అని పౌరోహిత్యుడుకికనబడకుండా ఒక్కపోటు ఇచ్చింది మీన, కోపంతో. పురోహితుడువైపు తిరిగి గుడ్లెర్రజేసి "ఏమండీ, వెంకటేశ్వర్లుగారూ! సరిగ్గా చెప్పలేరా? ఈ విధంగానేనా వ్రతాలు చేయిస్తున్నారు?" అన్నది.

వెంకటేశ్వర్లుకి శరీరంనుండి ముచ్చెమటలు కారటం మొదలు పెట్టేయి. అతగాడు పదిహేను రోజులయి ముక్కుపొడుం పీల్చలేదు. పీల్చితే ముక్కునుండి రక్తంపడుతుందని డాక్టరు చెప్పేడట. పీల్చకపోవటంచేత ముక్కు దిమ్మవేసినట్టుగా ఉన్నది. మెదడుకు పిచ్చిపట్టినట్లుగా ఉంది. ఏం తోచలేదు. వెంకటేశ్వర్లుకి ఎంతసేపు ముక్కుపొడుం ధోరణియే.

మనస్సు ముక్కుపొడిమీదకు పోవటంచేత "ఇదంఫలం మయాదేవ స్థాపితం పురతస్తవ" అనటానికి బదులు 'తులం పొడుం'' అని చటుక్కున అనేసేడు. గొప్ప పండితుడు కాబట్టి చేసిన తప్పును వెంటనే సమర్థించుకొనుచూ మిగతాశ్లోకం పూర్తిచేశాడు.

ఈ సంగతి కాని కొంప మునిగి మీన కనిపెట్టిందేమోయని వెంకటేశ్వర్లు బెబ్బరిల్లిపోతున్నాడు. మీనకు పొట్ట చీరితే అక్షరం లేదనీ జ్ఞాపకం వచ్చింది. అయినా శృతపాండిత్యం వల్ల ఈ తప్పుశ్లోకం గ్రహించిందేమోనని మళ్లా అనుమానం పట్టుకుంది.

"అయ్యో! సత్యదేవా! నీవే దిక్కు నమ్మిన వారిని నాశనంచేయని తండ్రీ! రక్షించు" అంటూ మనస్సులో ధ్యానించుకొని "అమ్మా, నేను సరిగ్గా చెప్పలేదా?" అన్నాడు మీనంతో.

మీన మంచి చలాకీ అయిన ఆడది

'నేను సరిగా చెప్పలేదా' అని వెంకటేశ్వర్లు అడిగేసరికి, "తోక తొక్కిన తాచులాగ లేచి" ఏం చెప్పేరు? అంతా తప్పే చెప్పారు, తప్పే చేశారు" అని దబాయించింది మీన.

వెంకటేశ్వర్లు ధైర్యంతెచ్చుకొని "అమ్మా! తప్పా! నేనా చెప్పేను. 'మాది మంచి పురోహిత వంశం, నేను విద్వాన్ పరీక్షకు ప్రయత్నించాను. నేను తప్పుచెప్పటం ఎరగను. అయితే

## వ్యాసకర్తలకు:

★

- రచనాభ్యాసంగానికి మీరు క్రొత్తవారే కావచ్చు. ఐనా లోకానికి తెలపవలసిన కొన్ని క్రొత్త విషయాలు మీలో ఊరకలు వేస్తూ వుండి వుంటాయి. కాబట్టి ఎట్టి సంకోచమూ లేకుండా ఉత్సాహంతో ప్రయత్నించి మీ రచన మాకు పంపండి. ఏమాత్రం బాగున్నా సవరించి ప్రచురించటానికే సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాము.
- హాస్యప్రధానమైన వ్యాసాలకు ఆనందవాణి ప్రాధాన్య మిస్తుంది.
- తప్పనిసరి ఐతేకాని రచనలలో ఇంగ్లీషు పదాలు వాడకూడదు.
- వినోదము కలిగించే విజ్ఞానదాయకమగు చిన్న చిన్న రచనలయితే వేగంగా ప్రకటింప వీలవుతుంది.
- క్రొత్త సమస్యలకు సంబంధించి, ప్రసాదమైన హాస్యధోరణిలో ఉంటే తప్ప పద్య వ్యాసములు పంపవద్దు.
- ప్రతి వ్యాసంతోనూ మూడు కాన్ల పోష్టు బిళ్లలు పంపితేనే ప్రకటించె పక్షాన తెల్పడానికీ, నచ్చకపోతే వాపసు చేయటానికీ వీలవుతుంది. కార్డులు జతపర్చవద్దు.
- ప్రతివ్యాసంపయినా వ్యాసకర్త పూర్తి చిరునామా ఉండాలి.
- సరసమయిన ఊహాలు కల్గి, వినోదింపజేసే వ్యంగ్యచిత్రాలనుకూడ ప్రచురణకు పంపవచ్చు.
- రచనలు, చిత్రాలు వ్యక్తుల పేర గాక— 'ఆనందవాణి' సంపాదకునకు 12 తంబుశెట్టి వీథి, పోష్టుబాక్సు నం. 1588 మదరాసు-' అని వ్రాయాలి. లేకుంటే వ్యాసపరిశీలనము ఆలస్యము కావచ్చు.

—సంపాదకుడు

ఒక్కటి. అక్షరాభ్యాసం అయినప్పటినుంచి ఒక వేలు నేలమీద, రెండు వ్రేళ్ళు ముక్కుపొడుంతోను అరిగిపోయేయి. డాక్టరు ముక్కుపొడుం పీల్చ వద్దన్నాడు. దానిచే ముక్కునరాలకు నిస్సత్తువ కలిగి మిగతా నరాలకుకూడా వ్యాపించింది"

అని ఇంకా ఏదో చెప్పబోతూండగా మీన అడ్డుతగిలి "అయితే అట్లాగేనా అనటం" అన్నది.

"ఏం తప్పుందమ్మా! నీకు సంస్కృత పాండిత్యం లేదు. తులం పొడుం, మయాదత్తం మంచి నేతి సమన్వితం. ఇందులో తప్పేమిటి. 'మంచి గోధుమనూకలో తులం ఏలకులపొడి వేసి మంచి నేతితో కలిపి ప్రసాదముచేసి, స్వామీ నీముందు పెట్టితిని, నా కోరిక నెరవేర్చు' అని ప్రార్థనే గదూ ఆ శ్లోకతాత్పర్యం." అన్నాడు వెంకటేశ్వర్లు.

"నాకు ఆ మాత్రం తెలియకపోలేదు. మేము అంత పిసినిగొట్టులమా? ఎంత డబ్బు ఖర్చు చేసి ఈ ఇల్లు కట్టేమో మీకు తెలుసా? వ్రతం చూడ్డానికని ఎవరిని పిలవనంతమాత్రానే మా సంగతి మీకు తెలిసిపోయిందా?" అంది ఆమె.

"అమ్మా! అమ్మా! ఎంతమాట. మీరు గొప్పవారు కాదని ఈ శ్లోకంలో ఎక్కడా లేదు. మీరు గొప్పవారే ముమ్మాటికి" అన్నాడు. వెంకటేశ్వర్లు.

"అందుకనేనా తులం గోధుమరవ్వ ప్రసాదం చేసామని కవిత్వాలు చెప్తున్నారు? తులమో, అరతులమో ఆ గొడవ మీకెందుకు?" అని, వ్రతం వేగిరం పూర్తి చేయించమని చెప్పి ఊరుకొంది.

వెంకటేశ్వర్లు బ్రతుకు జీవుడా అనుకున్నాడు. మన పురోహితులు ఇల్లా వున్నారు. వ్రతాచారులు అల్లా వున్నారు.

---

## క్రొత్త వేమనపద్యం

గంటలోన నడువగలుగు పట్నములోన
బద్ధకిష్టి నిలచె బస్సుకొరకు
రెండుగంటలవగ నిండు బస్సొచ్చెరా
విశ్వదాభిరామ వినురవేమ.

—కాశీపట్నం.